సాక్షి
నిర్మల్
శనివారం : 29 : జూన్ : 2024



'పరిషత్'లలో ప్రత్యేక పాలన?

జూలై 4, 5 తేదీల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. దీంతో జిల్లా, మండల పరిషత్‌లు త్వరలో ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. 8లో▸



పరిశోధనల ద్వారా.. పురోగతి

మానవజీవితం రసాయనశాస్త్ర అధ్యయనం, పరిశోధనతో ముడిపడిందని ప్రముఖ పరిశోధకుడు రాజేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నిర్మల్ డిగ్రీ కాలేజీలో ప్రసంగించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పునరావాస గ్రామాల పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐటీడీఏ అధికారి

కడెం: రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాలను ఐటీడీఏ జేడీఎం నాగభూషణం, ఏపీవో మనోహర్ శుక్రవారం సందర్శించారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారితో సమావేశమై మాట్లాడారు. పునరావాస గ్రామాలవారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఐటీడీఏ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్, వివిధ పథకాల ద్వారా రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట ఎఫ్ఆర్వో శంకర్, హైటికాస్ ప్రతినిధి వెంకట్, రాజేశ్వర్ తదితరులున్నారు.

మాజీ ప్రధాని పీవీకి నివాళి



పీవీకి నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎక్స్ రోడ్డు వద్ద మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మాట్లాడుతూ.. ప్రధానిగా పీవీ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. నాయకులు అల్లూరి మల్లారెడ్డి, గంగ్రత్ ఈశ్వర్, ఎంబడి రాజేశ్వర్, నాందేడపు చిన్ను, కౌన్సిలర్ గంగ్రత్ రమణ, ప్రభాస్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు పరికిపండ్ల స్వదేశ్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్, రవికుమార్, గణేశ్, శ్రీకాంత్, ప్రశాంత్, సురేందర్, మధుకర్‌రెడ్డి, వేణు, నర్సయ్య, రాజ్ మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గోదావరినదిలో తెప్పపూజలు



తెప్పపూజలు నిర్వహిస్తున్న మహిళలు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి వంతెన వద్ద గోదావరి నదిలో శుక్రవారం మహిళలు తెప్ప పూజలు నిర్వహించారు. మహిళలకు గంగాదేవికి హారతి ఇచ్చారు. మహిళలు గోదావరి నదిలో స్నానాలాచరించి తెప్ప పూజలు నిర్వహించారు. నదిలో తెప్పలు విడిచారు. అక్కడే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బహుమతులు ప్రదానం



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న నాగేశ్

భైంసాటౌన్: ఆర్టీసీకి లక్ష్మే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు సంస్థ ఉద్యోగుల పిల్లలకు భైంసా డిపోలో శుక్రవారం 'ఆర్టీసీ ఆదాయం పెంపు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి కండక్టర్ సలీం కుమారుడు సాజిద్, రెండో బహుమతి కండక్టర్ ప్రేమ్‌స్వరూప్ కుమారుడు మణిదీప్ గెలుపొందగా, ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్ బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, డిప్యూటీ సూపరింటెండెంట్ నజీరొద్దీన్, ఉద్యోగులున్నారు.

ఐసీడీఎస్ సీడీపీవోను తొలగించాలని ఆందోళన

పెంబి: ఖానాపూర్ ఐసీడీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సీడీపీవో అవినీతికి పాల్పడుతూ.. కిందిస్థాయి ఉద్యోగులను నానా ఇబ్బందులతో పీడిస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల నుంచి ప్రతీనెల డబ్బులు వసూలు చేస్తున్న సీడీపీవో నామమాత్రపు తనిఖీలతో వదిలేస్తున్నారని తెలిపారు. డబ్బులు ఇవ్వనివారిని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తప్పు చేసిన వారిని వదిలేసి అంగన్‌వాడీ టీచర్లను వేధించడం సరికాదని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన సీడీపీవో సరితను తొలగించాలని, లేదంటే జిల్లా స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు గంగారెడ్డి, శంకర్, మహేందర్, రియాజ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

చిరగని టికెట్లు!



కార్యాలయంలో తనిఖీ చేస్తున్న రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి (ఫైల్)

- బాసరలో ప్రసాద టికెట్ల రీసైక్లింగ్
- కౌంటర్ లెక్కల్లో తేడా బట్టబయలు
- బాసరవాసుల పరిశీలనలో వెల్లడి
- ఆలయ ఈవో విచారణలో నిర్ధారణ
- ఘటనలో ఆరుగురిపై సస్పెన్షన్ వేటు

భైంసా/బాసర: బాసర ఆలయంలో ఎన్నో ఏళ్లుగా ప్రసాదాల విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో ఆలయ ఉన్నతాధికారులకూ ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. తాజాగా శుక్రవారం బాసర గ్రామస్తులు ప్రసాదాల తయారీ కేంద్రం నుంచి వెళ్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. పులిహోర ప్యాకెట్లు లెక్కించారు. రికార్డుల్లో నాలుగు బుట్టల్లో 400 ఉన్నట్లు సిబ్బంది పేర్కొనగా, లెక్కిస్తే సుమారు 640 ప్యాకెట్లు ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించారు. వెంటనే ఆలయ ఈవో విజయరామారావును కలిసి ఫిర్యాదు చేశారు. ప్రసాదాల విక్రయకేంద్రానికి వెళ్లి పరిశీలించిన ఈవో పులిహోర ప్యాకెట్లు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. భక్తులు టికెట్లు కొనుగోలు చేసి కౌంటర్‌లో ఇవ్వగానే వారు వాటిని చించి ప్రసాదం ఇవ్వాలి. కానీ.. కౌంటర్‌లోని సిబ్బంది పలు టికెట్లు చింపకుండా ఉంచారు. వాటిని బుట్టలోని చించిన టికెట్ల కింద దాచారు. దీనిని ఈవో నిర్ధారించారు.

ఆరుగురిపై సస్పెన్షన్ వేటు

ప్రసాదాల విక్రయాల్లో అవకతవకలు, టికెట్ల రీసైక్లింగ్ నేపథ్యంలో ఇద్దరు రెగ్యులర్ అధికారులు, నలుగురు ఎస్ఎంఆర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు ఈవో విజయరామారావు తెలిపారు. ఈ విషయంపై లోతుగా విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించాలని బాసర గ్రామస్తులు కోరుతున్నారు.

రికార్డులు, నిల్వలకు పొంతనేది?

బాసర ఆలయంలో ప్రసాదాల తయారీ విషయంలో రికార్డులు, అక్కడ ఉండే నిల్వలకు ఎప్పుడూ పొంతన ఉండదు. గత మార్చి 31న ఆలయానికి విజిలెన్స్ అధికారి, రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి వచ్చి రికార్డులు పరిశీలించారు. ప్రసాదాల తయారీ కేంద్రానికి వెళ్లి తనిఖీ చేశారు. అక్కడి నిల్వల విషయంలో అసహనం వ్యక్తంచేశారు. సెంట్రల్‌రూంలో ఆ రోజు రికార్డులను పరిశీలించి అప్పట్లోనే ఈవోకు చార్జి మెమో ఇచ్చారు. బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రసాదాల తయారీ కేంద్రంలోనూ, టెండరు ఖరారు విషయంలోనూ, కాంట్రాక్టర్లకు టెండరు కట్టబెట్టిన విషయంలోనూ అప్పట్లో ఈవోను వివరణ కోరుతూ.. దేవాదాయ కమిషనర్ హన్మంత్‌రావు మెమో జారీచేశారు. టెండర్ల విషయంలో మార్కెట్‌రేట్ల కన్నా అధిక రేట్లకు టెండరు ఖరారు విషయంతోపాటు ఇతర అంశాలపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోరాదో.. జారీచేసిన వివరణలో కోరారు. ఇలా మెమోలు జారీచేసినా ఉన్నతాధికారులు కదలడంలేదు. ఘటన జరిగిన సమయంలో ఎవరో ఒకరిని బాధ్యులను చేసి చేతులు దులుపుకొంటున్నారు. అమ్మవారి ఆలయంలో అవినీతికి పాల్పడే ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవడంలేదు. ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే నిత్యం రూ.లక్షల్లో అక్రమాలు జరుగుతాయని బయటప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. అసలు సూత్రదారులను వదిలేసి కొంతమంది సిబ్బందిపై వేటువేసి చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు. రికార్డులు, స్టాక్ రూం, ప్రసాదాల తయారీకేంద్రం, విక్రయకేంద్రాల్లో పొంతనలేని లెక్కలే ఉంటాయి. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అక్రమాలకు బ్రేక్ పడడంలేదు. సంఘటనలు జరిగిన వెంటనే సీసీ పుటేజీలు డిలీట్‌చేస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజువారీగా ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే ఈ ఘటనలు జరుగుతాయని, ఇలా అక్రమంగా సంపాదించిన డబ్బు అంతా కలిసి పంచుకుంటున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

మారని సిబ్బంది తీరు

మార్చి 31న విజిలెన్స్ అధికారి, రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి తనిఖీ తర్వాత ఆలయంలో మార్పు వచ్చిందని అంతా భావించారు. కానీ, ఆలయంలో ఉన్నతాధికారులే వెనుకుండి ఈ తతంగాన్ని నడిపిస్తున్నారన్న వాస్తవాలను గుర్తించడంలేదు. పైగా ఏవైన ఘటనలు బహిర్గతమైతే అందులోంచి బయటపడేందుకు సంబంధిత అధికారుల వద్ద తమ పలుకుబడిని వినియోగిస్తున్నారు. నిత్యం రూ.లక్షల్లో అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు ఏళ్లుగా వినిపిస్తున్నాయి. ఇంత జరిగినా ఆలయంలో ఐఏఎస్ అధికారిని నియమించేందుకు ప్రభుత్వం దృష్టిపెట్టడంలేదు. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం ఇక్కడికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సరస్వతీ ఆలయ ప్రతిష్టను దిగజార్చేలా ఇక్కడి సిబ్బంది పనిచేసినా పట్టించుకోవడంలేదు. భక్తులకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతుంటే ఇక్కడికి వచ్చేవారి నుంచి అక్రమ మార్గంలో ఎలా సంపాదించాలో అనే విషయంపైనే అక్రమార్కులు దృష్టిసారిస్తున్నట్లు విమర్శలున్నాయి.

1నుంచి ఈ-టికెట్ విధానం

జూలై 1 నుంచి ఆన్‌లైన్‌లో ఈ–టికెట్ విధానం అమలుచేస్తాం. బాసర గ్రామస్తుల సూచనమేరకు ప్రసాదాల కౌంటర్‌కు వెళ్లాం. అక్కడ పరిశీలించగా 290 పులిహోర ప్యాకెట్లు అధికంగా ఉన్నట్లు గుర్తించాం. టికెట్లు చింపకుండానే అలాగే ఉంచిన విషయాన్ని నిర్ధారించాం. రికార్డులు పరిశీలించగా 296 తేడా ఉన్నట్లు గుర్తించాం. స్టోర్స్, టికెట్ కౌంటర్లను పరిశీలించాం. ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, నలుగురు ఎస్ఎంఆర్‌లను సస్పెండ్ చేశాం.

– విజయరామారావు, బాసర ఆలయ ఈవో

నిత్యం ఇదే తంతు..

బాసర అమ్మవారి ఆలయంలో రూ.20కు పులిహోర, రూ.25కు లడ్డూ, రూ.100కు అభిషేకం లడ్డూ విక్రయిస్తారు. అక్షరాభ్యాసాల టికెట్లు రూ.వెయ్యికి అమ్ముతారు. భక్తులు వివిధ సేవలు పొందాలంటే కౌంటర్‌లో టికెట్లు కొనుగోలు చేయాలి. భక్తులు కొనుగోలు చేసిన టికెట్లను సిబ్బంది తీసుకుని వారిని పూజలకు అనుమతిస్తారు. ఆ సమయంలో అక్కడి సిబ్బంది కొన్ని టికెట్లు చింపి మరికొన్నింటిని కిందపారేసి ఉంచుతారు. అనంతరం చింపిన టికెట్లతో నిండిన బుట్టలను బయటకు తీసుకువెళ్తారు. ఆ సమయంలో వాటిలోని చింపని టికెట్లు సేకరించి మళ్లీ విక్రయిస్తారు. ముఖ్య పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు వచ్చినపుడు వీటిని రీసైక్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అందరికీ తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

ముందస్తు చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: భారీ వర్షాలు, వరదలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానల నేపథ్యంలో ముందస్తు చర్యలపై ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి ఆమె సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వరదలొస్తే స్వర్ణ, కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు, గోదావరి పరీవాహక లోతట్టు ప్రాంతాల గ్రామాలకు ముందస్తు సమాచారం అందించి వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా అప్రమత్తం చేయాలని సూచించారు. పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో గత వరదలతో జరిగిన నష్టం పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిసాస్టర్ మేనేజ్మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. రహదారులు, వీధుల్లో వర్షపునీరు నిల్వకుండా వెంటవెంటనే తొలగించి ఆయిల్‌బాల్స్ వేయాలని పేర్కొన్నారు. దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు ఫాగింగ్ ప్రక్రియ నిరంతరం చేపట్టాలని తెలిపారు. పంచాయతీరాజ్, మునిసిపల్ యాక్ట్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదల సమయంలో పోలీస్‌శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, అటవీ, పంచాయతీ, మునిసిపాలిటీ శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అటవీ శాఖాధికారి ప్రసాద్, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అమ్మవార్లకు పుట్టింటి పట్టుచీర



మహా అన్నదానంలో పాల్గొన్న భక్తులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం స్థానిక రైతులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాగు సమయంలో ఏటా గ్రామస్తులు అమ్మవారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పూజల అనంతరం సరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు పుట్టింటి పట్టుచీర, వేదవ్యాస మహర్షికి పుట్టు పంచెలను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. మధ్యాహ్నం హారతి తర్వాత ముగ్గురమ్మలతో పాటు వేదవ్యాస మహర్షికి మహానైవేద్యం సమర్పించి అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం (ఊరి బండారా) చేశారు. ఊరి బండారాలో గ్రామస్తులతోపాటు భక్తులు పాల్గొని మహాప్రసాదాన్ని స్వీకరిస్తే వివిధ రకాల రుగ్మతలు నయమవుతాయని వారి నమ్మకం. అమ్మవారి ఆశీస్సులతో పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తులు, రైతులు పేర్కొన్నారు.

ఈ-శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



కార్మికులకు సభ్యత్వ పత్రాలు ఇస్తున్న స్వదేశ్

నిర్మల్‌ఖిల్లా: భవన నిర్మాణ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా ఈ–శ్రమ్, బీవోసీ వర్కర్స్ బోర్డులో తప్పనిసరిగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల సూచించారు. శుక్రవారం ఆయన పలువురు కార్మికులను తమ సంఘంలో సభ్యులుగా చేర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణరంగంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన పలువురు కార్మికులు జిల్లాలో పీవోపీ, పెయింటింగ్ పనులు చేస్తున్నారని తెలిపారు. ఇందులో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీరంతా ఈ–శ్రమ్, బీవోసీ వర్కర్స్ బోర్డుల్లో తప్పనిసరిగా సభ్యత్వం పొందాలని సూచించారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ద్వారా సామాజిక, ఆర్థిక భద్రత లాంటి ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మహ్మద్ అక్రం, రఫీ, ఆజాద్ తదితరులకు సభ్యత్వ నమోదు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కొమ్ము గీత, జగదీశ్, శంకర్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- డ్రై డే అమలు తీరు పరిశీలన



డ్రైనేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆగ్రా కాలనీ, శాంతినగర్‌లో చేపట్టిన డ్రై డే అమలుతీరును పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. డ్రై డే అమలు తీరును పంచాయతీ, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఎంహెచ్‌వో ధనరాజ్, మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ డీఈ సంతోష్, వైద్యులు రాజేందర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి రవీందర్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమవార్‌పేట్ పాఠశాల పరిశీలన

జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశీలించి పిచ్చిమొక్కలు తొలగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తరగతుల వారీగా విద్యాబోధన, క్రీడలు, హాజరు, ఉత్తీర్ణత శాతం, యూనిఫాంలు, పుస్తకాల పంపిణీ తదితర వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి ప్రతీరోజు చిన్నారులకు గుడ్లు, పాలు, పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన చేపట్టిన తాగునీరు, టాయిలెట్స్, మైనర్, మేజర్ రిపేర్లు, బాలికల కోసం మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ తదితర పనులు పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఈవో రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

భైంసా–కిని బస్సు ప్రారంభం



డ్రైవర్, కండక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుభీర్: భైంసా నుంచి సోనారి మీదుగా మహారాష్ట్రలోని కిని వరకు నడవనున్న బస్సు సర్వీస్ శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సును నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కాగా, సోనారి గ్రామానికి బస్సు చేరుకోగా గ్రామస్తులు డ్రైవర్, కండక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్యంరావ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

భైంసాటౌన్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా జీవన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న నాగమణి ప్రమోషన్‌పై వెళ్లగా, ఆమె స్థానంలో జీవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు అతడిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు కృష్ణయ్య, వేణు, లింగం, నరేశ్, మల్లేశ్, శ్రీనివాస్, రాజేశ్వర్, మమత, రీనా, కల్పన, సుచిత్ర, సాగర్ తదితరులున్నారు.

ఉండేదెవరో.. వీడేదెవరో..?

- 'గులాబీ' పార్టీలో అంతుచిక్కని నేతల వైఖరి
- అధికార పార్టీవైపు కీలక నేతల చూపు
- బలహీన పడుతున్న క్యాడర్
- ఉమ్మడి జిల్లాలో పట్టు కోల్పోతున్న బీఆర్ఎస్



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా తగిలిన ఎదురుదెబ్బలతో భారత రాష్ట్ర సమితి నేతలు పక్కచూపులు చూస్తున్నారు. సీనియర్ నేతలతోపాటు తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో ఎవరు ఉంటారో.. ఎవరు పోతారో తెలియని పరిస్థితి ఉంది. దీంతో క్యాడర్‌లోనూ అయోమయం నెలకొంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీన పడితే ఇబ్బంది తప్పదని భావిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ, మండల, మున్సిపల్, నియోజకవర్గ, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు పార్టీని వీడకుండా అధినేత చేస్తున్న యత్నం ఫలించడం లేదని తెలుస్తోంది.

ఎన్నికల ముందునుంచే వలసలు

అసెంబ్లీ ఎన్నికల ముందే బీఆర్ఎస్ నుంచి వలసలు మొదలయ్యాయి. వరుస ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇవి మరింత ఊపందుకున్నాయి. అసెంబ్లీ టికెట్ రాకపోవడంతో అప్పటి బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, రేఖానాయక్ బీఆర్ఎస్‌ను వీడారు. ఇక పార్లమెంట్ ఎన్నికల సమయంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలో సీనియర్ నాయకులైన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ బీఆర్ఎస్‌ను వీడి అధికార హస్తం పార్టీలో చేరారు.

ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో బీఆర్ఎస్‌కు బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్ మాత్రమే మిగిలారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈ ముగ్గురే పార్టీ కోసం పనిచేశారు. కానీ, ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డిపాజిట్ దక్కించుకోలేకపోగా, పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత అటు ఆదిలాబాద్, ఇటు పెద్దపల్లి పరిధిలో ఉద్యమ కాలం నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. సింగరేణి పరిధిలో కార్మిక సంఘ నాయకులు కూడా పార్టీ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని వీడుతున్నారు. మరోవైపు ఎమ్మెల్సీ దండే విఠల్ పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆయన పార్టీ మారుతారన్న చర్చ కూడా సాగుతోంది.

ఎమ్మెల్యేలకు కాంగ్రెస్, బీజేపీ గాలం..

ఇక ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు ఇటీవలే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి వచ్చారు. పార్టీలోనే ఉంటామని చెబుతున్నారు. అయితే ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు రాష్ట్ర అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గాలం వేస్తున్నాయి. ఈమేరకు ఆహ్వానాలు అందాయి. అయితే ఈ ఇద్దరు ఎమ్మెల్యేల నుంచి స్పందన రాకపోవడంతో చేరికలు నిలిచిపోయాయి. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ పార్టీ మారే సమయంలోనే కోవ లక్ష్మి మారుతారనే ప్రచారం జరిగింది. కానీ, ఆమె పార్టీలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు.

ఆర్ఎస్పీ చేరికతో ఊరట..

మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నుంచి పోటీ చేసి ఓడిన, అప్పటి బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరిక కొంత ఊరటనిచ్చింది. ప్రస్తుతం సిర్పూర్ నియోజకవర్గంలో ఆయనే బీఆర్ఎస్‌కు పెద్దదిక్కుగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మళ్లీ సిర్పూర్ నియోజకవర్గంలోని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

తాజా పరిస్థితులతో కలవరం

ఇక రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌ను నాయకులు వీడుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరుతున్నారు. తాజా రాజకీయ పరిణామాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ క్యాడర్‌ను కలవరపెడుతున్నాయి. ఇప్పటికే కీలక నేతలు పార్టీ వీడినందున.. పది నియోజకవర్గాల్లోని మిగిలిన సీనియర్ నాయకులతోపాటు ద్వితీయ శ్రేణి నాయకత్వం కూడా పార్టీ వీడుతోంది. మున్సిపల్, మండల, జిల్లా పరిషత్‌లోని ప్రజాప్రతినిధులు అధికార పార్టీలోకి క్యూ కట్టారు. పట్టణ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అవిశ్వాస తీర్మానాలతో బీఆర్ఎస్ నాయకుల్ని గద్దెదించారు. కొన్నిచోట్ల ఆయా పాలకవర్గాలే గంపగుత్తగా పార్టీని వీడాయి.

'పది'లో మళ్లీ ఫస్ట్

నిర్మల్‌ఖిల్లా: ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదల కాగా, జిల్లా 100శాతం ఉత్తీర్ణతతో మళ్లీ సత్తాచాటింది. గత రెగ్యులర్ ఫలితాల్లో 99శాతానికి పైగా ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా విడుదలైన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లోనూ మరోసారి నూటికి నూరుశాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది. 75మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 47మంది బాలురు కాగా, 28 మంది బాలికలున్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాలపై విద్యాశాఖ వర్గాలు హర్షం వ్యక్తంజేస్తున్నాయి.

క్లుప్తంగా

గుట్కా స్వాధీనం



గుట్కాతో సీఐలు ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలు, పాన్‌షాప్‌లలో ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ.5 లక్షల విలువచేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఏఆర్ ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సారంగాపూర్: ఈ నెల 26న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని మహావీర్‌తండాకు చెందిన ఆడె రమేశ్ (45) శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపారు. మృతుడు కొంతకాలంగా మద్యానికి బానిసకావడంతో అనారోగ్యం పాలయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన ఈనెల 26న గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన అతని భార్య ఆడె సుమన్‌బాయి వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుమన్‌బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గంజాయి స్వాధీనం

బేల: అక్రమంగా తరలిస్తున్న కిలో 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల ంలోని జూనోని, చప్రాల గ్రామాల అనుసంధాన జ ంక్షన్ వద్ద చేపట్టిన తనిఖీల్లో మండలంలోని మారు తిగూడకు చెందిన టేకం సంతోష్, ఆదిలాబాద్ మండలం రామాయి గ్రామానికి చెందిన డొక్రె గంగారం ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వారిని విచారించగా మండలంలోని పూసంగూడకు చెందిన టేకం లాలు నుంచి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. గంజాయి విలువ రూ.40వేలు ఉంటుదన్నారు. ముగ్గురిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాధిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడకు చెందిన కుంచపు గంగారాం (37) ఈనెల 12న దుబాయ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏజెంట్ మోసం చేయడంతో అప్పుల బాధ భరించలేక మనస్తాపానికి గురై గదిలో ఉరేసుకున్నాడు. శుక్రవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

పరిషత్‌లలో ప్రత్యేక పాలన?

- జూలై 4, 5 తేదీల్లో ముగియనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం
- 'స్థానిక' ఎన్నికల నిర్వహణపై స్పష్టత కరువు
- కులగణన తర్వాతే చేపట్టాలని పలువురి డిమాండ్

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు
ఆదిలాబాద్	168	17
నిర్మల్	156	18
మంచిర్యాల	130	16
కుమురంభీం	125	15



ఆదిలాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయం

కైలాస్‌నగర్/నిర్మల్‌చైన్‌గేట్: గ్రామ పంచాయతీల మాదిరిగానే జిల్లా, మండల ప్రజా పరిషత్‌లు కూడా త్వరలోనే ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. ఎందుకంటే జూలై 4, 5 తేదీల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తికానుంది. ఈలోగా ఎన్నికలు నిర్వహించడం అసాధ్యం. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినా ఎన్నికల నిర్వహణకు సమయం పట్టే అవకాశముంది. దీంతో గ్రామ పంచాయతీల మాదిరిగానే మండల, జిల్లా పరిషత్‌ల్లోనూ ప్రత్యేకాధికారుల పాలనే అమలులోకి వచ్చే అవకాశం కన్పిస్తోంది. ప్రభుత్వం నుంచి ఇంకా దీనిపై ఎలాంటి ప్రకటన రానప్పటికీ ప్రత్యేకం అనివార్యం కానుందనే ఉద్దేశంతో అధికారులు ఆదిశగా కసరత్తు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణ లేనట్లే

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 579 మంది ఎంపీటీసీ సభ్యులు, 66 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. ఇందులో ఎంపీటీసీ, ఎంపీపీల పదవీ కాలం జూలై 4వ తేదీతో ముగియనుండగా జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం జూలై 5తో ముగియనుంది. వీటికి ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కన్పించడం లేదు. 2019లో ఎంపీటీసీ, జెడ్పీటీసీల పాలకవర్గాల నిర్ణీత గడువు కంటే రెండు నెలల ముందుగానే అప్పటి ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించింది.

కానీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వీటి నిర్వహణకు అంత ఆసక్తి చూపనట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో సర్పంచ్‌ల తరహాలోనే ప్రత్యేకాధికారుల పాలన అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేకాధికారుల పాలన అనివార్యం కానుండడంతో ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రానప్పటికీ ఉమ్మడి జిల్లా యం

అధికారుల కసరత్తు

త్రాంగం ఆదిశగా ముందుగానే కసరత్తు ప్రారంభించింది. జిల్లా పరిషత్‌లకు ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక మండల పరిషత్‌లకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. ఇప్పటికే అన్ని మండలాలకు ఏదో ఒక శాఖ జిల్లాస్థాయి అధికారి మండల ప్రత్యేకాధికారిగా ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తున్నారు. దీంతో వారినే మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారిగా నియమిస్తారా? లేక మరో జిల్లాస్థాయి అధికారికి బాధ్యతలు అప్పగిస్తారా? అనేదీ త్వరలోనే తేలనుంది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఎన్నికలకు సిద్ధమైనప్పటికీ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే అవకాశం ఉండదు. రిజర్వేషన్లు, ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికే ొ రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. కనుక ఇప్పట్లో ఎన్నికలు లేనట్లుగానే కన్పిస్తోంది. ఎన్నికల మాట అటుంచితే పోటీకి తహతహలాడుతున్న అభ్యర్థులను రిజర్వేషన్ల అంశం ఆందోళనకు గురిచేస్తోంది. పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పదేళ్ల పాటు ఒకే రిజర్వేషన్ కొనసాగేలా చట్టం చేసింది. దాని ప్రకారంగానే 2019లో ఎన్నికలు నిర్వహించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి సర్కారు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారంగానే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక చట్టసవరణతో కొత్త రిజర్వేషన్లను ప్రకటిస్తుందా? అనేదానిపై అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీసీ కుల గణనకు ప్రభుత్వం మొగ్గు చూపుతుండటం, కొత్తగా మండలాలు ఏర్పడిన నేపథ్యంలో రిజర్వేషన్ల సవరణ అనివార్యమనే భావన కూడా రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. అయితే దీనిపై ప్రభుత్వం దీనిపై ఏదైనా ప్రకటన చేస్తే తప్ప దీనిపై స్పష్టత వచ్చే అవకాశం కన్పించడం లేదు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదెను చూపుతున్న బాధిత రైతు

ఖానాపూర్: పట్టణ శివారులోని తర్లపాడ్ గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో నందుర్క ఇందయ్యకు చెందిన గేదె గురువారం మేతకు వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో శుక్రవారం బాధిత రైతు వెతుకగా పంటచేలలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు వాపోయాడు. గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

తానూరు: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన దేవక్వాడ్ అశోక్ (31) రెండేళ్లుగా మద్యానికి బానిసై ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. శుక్రవారం మద్యం సేవించేందుకు డబ్బులు కావాలని ఇంట్లో అడగగా కుటుంబ సభ్యులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురై పంటచేనులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య దీక్ష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ కీర్తిని చాటాలి



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

- మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి
- రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

మంచిర్యాలటౌన్: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు తెలంగాణ కీర్తిని జాతీయస్థాయిలో చాటాలని మంచిర్యాల జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిక్స్ సన్‌రైస్ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించిన వారికి మంచి అవకాశాలు వస్తాయన్నారు. డీఎఫ్‌వో శివ ఆశిష్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య మాట్లాడుతూ మంచిర్యాలలో క్రీడలు నిర్వహించే వారికి తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బాబు, టోర్నమెంటు కన్వీనర్ గాజుల ముఖేశ్‌గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ నల్లాల ఓదెలు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్ల శంకర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల వాసు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లూరి సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



నవీన్ (ఫైల్)

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన అట్టోలి నవీన్ (32) కుంటాలలోని ఆదర్శ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో వృత్తివిద్యా కోర్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై కుంటాలకు వెళ్లి తిరిగివస్తుండగా తిమ్మాపూర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ వెల్లడించారు.

మృతికి నివాళి

కుంటాల: ఉపాధ్యాయయుడు వాటోలి నవీన్ మృతి విద్యార్థులకు తీరని లోటని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయుడు నవీన్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి



కరపత్రం ప్రదర్శిస్తున్న ఆర్ఎం సోలోమన్

ఆదిలాబాద్: వర్షాకాలం నేపథ్యంలో డ్రైవర్లు అప్రమత్తంగా బస్సులు నడపాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ డిపోలో డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్‌తో కలిసి గేట్ మీటింగ్ నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. బస్సు హెడ్ లైట్స్, ఫాగ్ లైట్స్ తప్పనిసరిగా ఆన్‌చేసి ఉంచాలన్నారు. రహదారిపై నీటి ప్రవాహం ఉన్నప్పుడు నీటి లోతు, ప్రవాహ వేగం అంచనా వేసిన తర్వాతనే వాహనాన్ని ముందుకు కదిలించాలన్నారు. బస్సులో సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే మెకానికల్ సూపర్‌వైజర్‌ను సంప్రదించాలన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

జైనథ్: మండలంలోని దీపాయిగూడకు చెందిన సుర్కుంటి ఆశారెడ్డి (37)ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దీపాయిగూడకు చెందిన ఆశారెడ్డికి ఆదిలాబాద్‌కు చెందిన కృష్ణవేణితో వివాహమైంది. దంపతులకు పాప, బాబు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరగడంతో ఇద్దరు పిల్లలతో కలిసి కృష్ణవేని ఆదిలాబాద్‌లో ఉంటోంది. భార్యాభర్తల నడుమ కోర్టు కేసులు సైతం నడుస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకున్నాడు. బయటకు వెళ్లిన తల్లి ఇంటికి వచ్చేసరికి ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు ఇంకా కేసు నమోదు చేయకపోవడంతో మృతికి గల కారణాలు తెలియరాలేదు.

ఎడ్లబండిలో తరలించిన గర్భిణి సుఖప్రసవం

ఇచ్చోడ: బావోజీపేట్ గ్రామానికి చెందిన వనిత ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో శుక్రవారం రాత్రి 12:40 గంటల ప్రాంతంలో సుఖప్రసవం జరిగి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విఠలేశ్వర ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో ఉన్న విఠలేశ్వర ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. హుండీని పగులగొట్టి అందులోని రూ.8వేల నగదు, 10 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాందేవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'మహా అభియాన్' త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రధాన మంత్రి జాతీయ న్యాయ మహా అభియాన్ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్ కుమార్, డీఎంహెచ్ఓ నరేందర్, ఏడీఎంహెచ్ఓ మనోహర్, డీటీడీఓ రమాదేవి, తహసీల్దార్లు, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కారు బోల్తా



బోల్తా పడిన కారు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై పార్డి(బి) బైపాస్ రోడ్ కూడలి వద్ద శుక్రవారం ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. స్థానిక ఓవైసీ నగర్‌కు చెందిన యువకులు మెట్‌పల్లిలో శుభకార్యం నిమిత్తం కారులో వెళ్తుండగా పార్డి(బి) బైపాస్‌రోడ్ కూడలి వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లిలో సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుగ్లావత్ రవీందర్(లై) నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న సిలిండర్ పేలింది. కుటుంబ సభ్యులు బయటకు పరుగెత్తడంతో ప్రాణాపాయం తప్పింది. ఫైరింజన్ అధికారులు, సిబ్బంది వెంకట్, శంకర్, చిన్నయ్య మంటలు ఆర్పివేశారు. ఘటనలో రూ.4 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పరిశోధనల ద్వారానే విజ్ఞాన పురోగతి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నిర్మలఖిల్లా: మానవ జీవితం రసాయన శాస్త్ర అధ్యయనం, పరిశోధనతోనే ముడిపడి ఉందని ప్రముఖ పరిశోధకులు, బెంగళూరుకు చెందిన ప్రఖ్యాత సంస్థ ఏరింగ్ ప్రోదేవ్ కంపనీ సీఈవో డాక్టర్ ఎల్.రాజేందర్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న రసాయన శాస్త్ర జాతీయస్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. రసాయన పరిశోధనలు మానవ జీవితం సుస్థిరాభివృద్ధిని సులభతరం చేస్తుందన్నారు. రసాయన శాస్త్ర రంగంలో సుదీర్ఘమైన భవిష్యత్తు ఉందని విద్యార్థులు తమ కెరియర్‌ను ఈ రంగం వైపు మరల్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.భీమారావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు నిర్మల్ జిల్లా కేంద్రంలో కొనసాగడం వల్ల స్థానికంగా విద్యార్థులను రసాయన పరిశోధనలపట్ల ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతిలో హానికారక రసాయనాలను తొలగించడానికి హరిత రసాయన శాస్త్ర పద్ధతులను వినియోగించాలని ప్రొఫెసర్ దిలీప్ స్వామి సూచించారు. అనంతరం సదస్సు సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త సరిత రాణి, కో కన్వీనర్ రమాకాంత్ గౌడ్, ప్రముఖ పరిశోధకులు డాక్టర్ సంపత్ కుమార్, దేశంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట వైద్యుల నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

కైలాస్‌నగర్: ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులపై ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణ ఉండేలా నల్గొండ జిల్లా కలెక్టర్ జారీ చేసిన సర్క్యులర్ మెమోను తక్షణమే ఉపసంహరించుకోవాలని టీటీజీడీఏ డిమాండ్ చేసింది. కలెక్టర్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్ ఎదుట ప్రభుత్వ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రిమ్స్ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యవేక్షణ కోసం రోజుకో ఇతర డిపార్టుమెంట్ల అధికారులను రోస్టర్ పద్ధతిలో నియామకం చేసి రిపోర్ట్ ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ఈ ఉత్తర్వులు వైద్య ఉద్యోగుల నైతికతను ప్రశ్నించినట్లుగా ఉన్నాయన్నారు. ఇలాంటి వాటితో వైద్యులు, వైద్య సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. ఒక ఎమర్జెన్సీ డిపార్టుమెంటుపై ఇతర శాఖల అధికారులు పర్యవేక్షణ చేసి రిపోర్ట్ పంపించాలని ఆదేశించడం శోచనీయమన్నారు. ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ కమలాకర్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఏ చైర్మన్ రాజీనామా చేయాలి



నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట

ఆదిలాబాద్: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చైర్మన్ రాజీనామా చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్ డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని శుక్రవారం ఎంపీ గోడం నగేశ్ ఇంటి ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా కపిల్ మాట్లాడుతూ వైద్య సీట్లకు సంబంధించి ప్రతిష్టాత్మక నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్నారు. లక్షల మంది విద్యార్థులు రాసే ప్రవేశ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విఫలమైందని మండిపడ్డారు. దీనిపై న్యాయవిచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు ఎంపీ ఇంట్లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆత్రం నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తాపడి ఐదు ఎద్దులు మృతి

నేరడిగొండ: మండలంలోని కుప్టి ఘాట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున పశువులను తరలిస్తున్న కంటైనర్ (లారీ) అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ఉన్న ఐదు ఎద్దులు (పశువులు) మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆదిలాబాద్ పశువుల మార్కెట్లో 20 పశువులను అనిల్ కుమార్, సాయికుమార్, సతీష్‌లు కొనుగోలు చేసి హైదరాబాద్ తరలించే క్రమంలో కుప్టి ఘాట్ వద్ద కంటైనర్ బోల్తా పడింది. అందులో ఉన్న ఐదు పశువులు సంఘటన స్థలంలోనే మృతి చెందాయి. డ్రైవర్‌తో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.